క్లుప్తంగా

బీబ్రా పంచాయతీలోనే కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

దహెగాం: మండలంలోని దేవాజీగూడ గ్రామాన్ని బీబ్రా పంచాయతీలోనే కొనసాగించాలని దేవాజీగూడ గ్రామస్తులు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేవాజీగూడ గ్రామాన్ని జెండాగూడలో కలిపి జెండాగూడను పంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారని కొత్తగా ఏర్పడే జీపీలో చేరబోమన్నారు. కొత్తగా ఏర్పడే జీపీలో కలపవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంత్ గాడ్గే బాబా



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బీఎస్‌పి, అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంత్ గాడ్గే బాబా, అంబేడ్కర్ తల్లి భీమాబాయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా, భీమాబాయిలు నేటి తరానికి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, విలాస్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, రమేశ్, మహేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

యూనియన్‌లో చేరిక



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శుక్రవారం జైనూర్ సెక్షన్ అసిస్టెంట్ లావుడ్య తిరుపతి 1104 యూనియన్ నుంచి 327 యూనియన్‌లో చేరాడు. ట్రాన్స్‌కో ఉద్యోగుల సంక్షేమం కోసం కంపెనీ జనరల్ సెక్రెటరీ ఇనుగాల శ్రీధర్ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్శితుడై యూనియన్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆత్రం సన్మానరావు, జంజిరాల శ్రీనివాస్, లక్ష్మణ్, కుమారస్వామి, మారుతి, గజానంద్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్

వాంకిడి: మండలంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ జావిద్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్, హోమ్‌గార్డు సంతోష్ పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న రితేష్ రాథోడ్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత అన్నిరంగాల్లో రాణించాలని బీజేపీ ఖానాపూర్ ఇన్‌చార్జి రితేష్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ రాథోడ్ రమేష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, కనక తుకారం, రాథోడ్ రాధిక, రాథోడ్ భీంరావ్, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, సుధీర్, మెస్రం జైరాం, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు కరువు
- పట్టించుకోని అధికారులు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలో 14 గ్రామ పంచాయతీ ఉండగా.. వాటిలో జనాభా 30వేలకు పైగా ఉన్నారు. నూతన మండలం ఏర్పాటై ఎనిమిది ఏళ్ల గడుస్తున్నా.. మండలంలో ఇప్పటి వరకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌సెంటర్ లేదు. లింగాపూర్ మండలానికి సరఫరా అయ్యే 11కేవీ విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కన విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. ట్రాక్టర్‌పై, ఎడ్లబండిపై వెళితే తీగలు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

ఎప్పుడు కూలుతాయే తెలియదు..

మండల కేంద్రంతో పాటు పొలాల్లో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారుల పర్యవేక్ష లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈదురు గాలులతో కూడిన వర్షాం కురిస్తే స్తంభాలు ఇళ్లపై విరిగి పడే అకాశం ఉంది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు..

మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేక ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయి. పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పశువులు ప్రమాదాల భారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

కంచె లేక ఇబ్బందులు



మండలంలోని వివిధ గ్రామాల్లో పొలాల్లో ప్రధాన రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులకు, ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.

– జాదవ్ అశోక్ నాయక్, లింగాపూర్

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలో గాంధీనగర్ ఏరియాలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదు.

– జాదవ్ ఇందల్, గాంధీనగర్

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బెజ్జూర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బహుజన సంఘాల నాయకులు కొండా రాంప్రసాద్ అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మతిస్థిమితం లేకుండా మాట్లాడిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, సారయ్య, గోలేటి కొండయ్య, దుర్గం తిరుపతి, పోశం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

బోథ్: తమ డిమాండ్లను పరిష్కరించాలని, తమకు రావాల్సిన జీతభత్యాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే గ్రామాలను శుభ్రం చేసే తమకు ప్రభుత్వం న్యాయం చేయడం లేదని వాపోయారు. వెంటనే తమ జీతాలు చెల్లించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం నారాయణ్‌సింగ్

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కౌటాల కాంప్లెక్స్ హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, మాట్లాడడం రావాలన్నారు. అనంతరం రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేసిన ఐఈసీ పోస్టర్, జెండర్ రెస్పాన్స్, ఎడ్యుకేషన్ కరపత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ సంపతి, హెచ్‌ఎం సాయినాథ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్న అధికారులు

రెబ్బెన: మండలంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 120 ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు పక్కా సమాచారం రావడంతో శుక్రవారం రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇసుకను నిల్వ ఉంచిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. మండలంలోని లేతన్‌గూడ రైల్వేగేట్ సమీపంలో, ఇందిరానగర్ సమీపంలోని సిమెంట్ బ్రిక్స్ వద్ద, పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలో, పెట్రోల్‌బంక్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 120 ఇసుక కుప్పలను గుర్తించినట్లు పేర్కొన్నారు. వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించిన, అక్రమంగా నిల్వ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమాల్లో మైనింగ్ ఏడీ గంగాధర్, ఆర్‌ఐ జయలక్ష్మి, పోలీస్ సిబ్బంది అంజన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో నిత్యం ట్రాఫిక్

- రోడ్లపైనే దుకాణాలు, వాహనాల పార్కింగ్
- తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రోడ్లు విస్తరించాలని ప్రజల వేడుకోలు



కౌటాలలో ట్రాఫిక్ జామ్

కౌటాల: కౌటాల మండల కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే మండల కేంద్రంలోని రోడ్లు మాత్రం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కౌటాలలోని మొగడ్‌దగడ్ రోడ్డు, విజయనగరం రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని కోయగూడ వరకు పెద్ద భవనాలు నిర్మించారు. అలాగే తలోడి గ్రామం, శివలింగపూర్ గ్రామాల వరకు ఇళ్లు నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. అలాగే మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలో జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లులు ఉండడంతో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి. కౌటాలలో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుకు అనుకొని ఉన్న టేలాల ఎదుటే వాహనాలు నిలుపుతున్నారు. రోడ్డు సమీపంలో ఇంటి యాజమనులు మొరం వేస్తుండడంతో మొరం రోడ్డుపై పడుతుంది. దీంతో దుమ్ము లేచి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

సోమవారం.. ట్రాఫిక్ జామ్

ప్రతీ సోమవారం కౌటాలలో నిర్వహించే వారసంతకు వేలాదిగా వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. వారసంత రోజు కౌటాల– బెజ్జూర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రోడ్డుపైనే బైక్‌లు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, కుమురం భీం చౌరస్తా, మొగడ్‌దగడ్ చౌరస్తా, తలోడి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.

రోడ్డు విస్తరించాలి..

గత నాలుగేళ్ల క్రితం కౌటాల– బెజ్జూర్ వరకు డబుల్ రోడ్డు వేశారు. ఆరోడ్డు కౌటాల మండల కేంద్రం నుంచి వెళ్తున్న రోడ్డు సమీపంలో దుకాణాలు ఉండండంతో దుకాణాల ఎదుట వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. దానికి తోడు రోడ్డు ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో డబుల్ రోడ్డు సైతం సింగిల్ రోడ్డుగా కనిపిస్తోంది. దీంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇతర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది అవుతుంది. కౌటాల మినీ స్టేడియం నుంచి తలోడి దసలి పట్టు పరిశ్రమ వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్, విజయనగరం, తలోడి రోడ్లను డబుల్ రోడ్డుగా వేయాల్సి ఉంది. ఇలా చేస్తే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కరం దొరుతుంది.

గణితంపై పట్టు సాధించాలి



రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం కౌటాల ప్రాథమిక పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేద కుటుంబంలో పుట్టిన రామానుజన్ కష్టతరమైన ఎన్నో గణిత సమస్యలను పరిష్కరించాలన్నారు. అతి చిన్న వయస్సులోనే గణిత సూత్రాలు, సమికరణాలు సిద్ధాంతాలు రూపొందించి ప్రపంచ గణిత శాస్త్రవేత్తల్లో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రామానుజన్‌ను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటలు రుచి చూస్తున్న మాజీ జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలంగాణ వంటకాల ఆనంద మేళా (ఫుడ్ ఫెస్టివల్) కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తయారుచేసిన రుచికరమైన వంటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల కోసం కంప్యూటర్లకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బదిలీలు పదిన్నతులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచులు సాకె ఆనంద్, పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ అధికారి చిన్నయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటిద్దాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంధన పొదుపును పాటిద్దామని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరం లేని సమయంలో విద్యుత్ వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, తుంరం మారుతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి



నర్సరీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

వాంకిడి: గ్రామ పంచాయతీల వారీగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖమాన, కనర్‌గాం, కోమటిగూడ గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే చేయాలనుకున్న వాడలోని ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పంచాయతీ కేంద్రాలో ఏర్పాటు చేస్తున్న నర్సరీలను పరిశీలించారు., బ్యాగు ఫిల్లింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేసి విత్తనాలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

'సహకార' రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: రైతులు సహకార సంఘం రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి హాజరై మాట్లాడారు. సంఘం ఆదాయంతో పాటు నిధుల వివరాలను సీఈవో కేశవ్ సభ్యులు ముందు చదివి వినిపించారు. పంట రుణాలతో పాటు తక్కువ వడ్డీకే ఇళ్లు, వాహనాల కొనుగోలు కోసం రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. తాంసి సహకార సంఘం ద్వారా రైతుల కోసం గిరిగాం, అర్లి(టి), అంతర్గాం గ్రామాల్లో గోదాం నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, డైరెక్టర్లు అశోక్ రెడ్డి, చంద్రన్న, కవిత పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ విజయవంతం చేయండి



వివరాలు వెల్లడిస్తున్న కమిటీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 22న శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు అగ్గిమల్ల గణేష్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీలు, కుల, మతాల కతీతంగా హాజరైన నాయకులు అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మేధావులు, ఉద్యోగులు, విద్యావంతులు పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు రత్నపురం రమేశ్, దాండిగే సందీప్, నిమ్మల ప్రశాంత్, భూమన్న, నవీన్ కుమార్, దయాకర్, నజీర్, జహీర్ రంజాని, రత్నజాడే ప్రజ్ఞకుమార్, గణేష్ మెకానే, మనోజ్, ప్రసన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

దహెగాం: మండలంలోని కల్వాడ, పీపీరావు కాలనీ గ్రామ పంచాయతీలకు మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలకు శుక్రవారం కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పక్కా భవనాలు లేని పంచాయతీలకు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు భవనాలు లేక పాలకవర్గం వారు ఇబ్బంది పడ్డారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోగేశ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.